క్లుప్తంగా

మాజీ ఎమ్మెల్యేకు ఆహ్వానం



ఆహ్వాన పత్రికను అందజేస్తున్న నాయకులు

కొండపాక(గజ్వేల్): మండలంలోని దుద్దెడ పెద్దమ్మ తల్లి దేవాలయ పంచమ వార్షికోత్సవ ఆహ్వాన పత్రికను గురువారం జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డికి మాజీ సర్పంచ్ ఆరెపల్లి మహాదేవ్‌గౌడ్ అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి అనంతుల నరేందర్, మండల అధ్యక్షుడు లింగారావు, ముదిరాజ్ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన డీసీసీబీ చైర్మన్



మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి శాలువా కప్పిన డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి

కొండపాక(గజ్వేల్): డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి గురువారం హైదరాబాద్‌లో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి దీపదాస్‌లను మర్యాద పూర్వకంగా కలిశారు. బీఆర్‌ఎస్ నుంచి రెండు రోజుల కిందట ఆయన సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ రామకృష్ణారెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ బూర్గుల సురేందర్‌రావు తదితరులు ఉన్నారు.

కవి సాయంత్రం గ్రూప్ సలహామండలి ఎంపిక

హుస్నాబాద్: జన జాగృతి కళా సంస్థ అంతర్భాగమైన కవి సాయంత్రం సోషల్ మీడియా గ్రూప్ సలహా మండలి సభ్యులను గురువారం ఎంపిక చేసినట్లు సంస్థ వ్యవస్థాపకుడు ముక్కెర సంపత్ కుమార్ గురువారం తెలి పారు. ఇటీవల జాతీయ, అంతర్జాతీయ స్థాయి కమిటీలను ఏర్పాటు చేశారన్నారు. సలహా మండలి సభ్యులుగా అడిషనల్ కలెక్టర్ జీవీ శ్యామ్ ప్రసాద్ లాల్, సినీగేయ రచయిత మౌన శ్రీ మల్లిక్, సీనియర్ అడ్వకేట్ గులాబీల మల్లారెడ్డి, జైలు డీఎస్పీ దార్ల కాళిదాస్, జర్నలిస్ట్ బోయిన భాస్కర్, విశ్రాంత ఎన్టీపీసీ ఉద్యోగి రాములను ఏకగ్రీవ తీర్మానంతో ఎంపిక చేసినట్లు తెలిపారు.


బొడ్రాయికి జలాభిషేకం



బొడ్రాయికి జలాభిషేకం చేస్తున్న మహిళలు

మద్దూరు(హుస్నాబాద్): మండలంలోని లద్నూరు గ్రామంలో బొడ్రాయి ప్రతిష్ఠలో భాగంగా గురువారం భూలక్ష్మి, మహాలక్ష్మి విగ్రహాలతో పాటు బొడ్రాయికి జలాభిషేకం చేశారు. మహిళలు రాగిబిందెల్లో నీళ్లు తెచ్చి బొడ్రాయిపై పోశారు. కార్యక్రమంలో బొడ్రాయి ఉత్సవ కమిటీ అధ్యక్షుడు రాజిరెడ్డి, గౌరవ అధ్యక్షుడు పుట్ట వెంకటరమణారెడ్డి, ఎంపీటీసీ గుజ్జుక సమ్మయ్య, దుర్గమ్మ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు అన్నోజు కనకాచారి, మాజీ సర్పంచ్‌లు జీడికంటి సుదర్శన్, సురేష్, విజయ పాలకేంద్రం డెయిరీ చైర్మన్ రాపాక బుచ్చిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మొక్కజొన్న పంటకు నిప్పు



కాలిబూడిదైన మొక్కజొన్న పంట

జగదేవ్‌పూర్(గజ్వేల్): అగ్ని ప్రమాదంలో మొక్కజొన్న పంట కాలిపోయిన సంఘటన మండలంలోని అలిరాజ్‌పేట గ్రామంలో గురువారం జరిగింది. రైతు నర్సింహారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం తనకున్న ఎకరంలో మొక్కజొన్న పంట సాగుచేశానని, గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయని వాపోయాడు. మంటలను అదుపు చేసేందుకు ఎంత ప్రయత్నం చేసినా ఫలితంలేకుండాపోయిందని కన్నీటి పర్యంతమయ్యాడు. సుమారు రూ.లక్ష వరకు పంట నష్టం జరిగిందని, ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకున్నాడు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పట్టణంలోని శ్రీనగర్ కాలనీలో 11 కేవీ విద్యుత్ సరఫరా లైన్‌ల కింద ఉన్న చెట్ల కొమ్మల తొలగించనున్న కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు సిద్దిపేట పట్టణ అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ సుధాకర్‌రెడ్డి తెలిపారు. శ్రీనగర్ కాలనీ, శివాజీ నగర్ కాలనీల పరిసర ప్రాంతాల్లో ఉదయం 7.30 నుంచి 8.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, విద్యుత్ వినియోగదారులు గమనించాలన్నారు.

ఎన్నాళ్లీ కష్టాలు?

- బీటీ రోడ్ల నిర్మాణాలకు నిధులు మంజూరు
- మూడు నెలల క్రితం పనులు ప్రారంభం
- కంకర పరిచి వదిలేసిన కాంట్రాక్టర్
- స్పందించని అధికారులు, ప్రజాప్రతినిధులు



రామవరం నుంచి శివాలి తండా మార్గంలో కంకర తేలిన రోడ్డు

మారుమూల పల్లెలకు రోడ్డు సౌకర్యం కల్పించేందుకు ప్రభుత్వం బీటీ రోడ్ల నిర్మాణాలకు నిధులు మంజూరు చేసింది. అయితే కాంట్రాక్టర్ నిర్మాణాలను అసంపూర్తిగా వదిలివేయడంతో కంకర పరిచిన రోడ్లపై రాకపోకలు సాగించేందుకు నానా అవస్థలుపడుతున్నారు. కంకర రోడ్లపై ప్రయాణిస్తుండటంతో తమ వాహనాలు పాడవుతున్నాయని వాపోతున్నారు. అధికారులు రోడ్ల నిర్మాణం త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

అక్కన్నపేట(హుస్నాబాద్): గ్రామీణ ప్రజలకు రవాణా సౌకర్యం కల్పించేందుకు ప్రభుత్వం రోడ్ల నిర్మాణాలకు నిధులు మంజూరు చేస్తోంది. గుత్తేదారుల అలసత్వం ప్రజలకు శాపంగా మారుతోంది. అక్కన్నపేట మండలంలోని రామవరం నుంచి శివాలితండా మీదుగా మల్లన్నగుట్ట వరకు దాదాపు రూ.4 కోట్ల వ్యయంతో రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. ఈ నిధులు గిరిజన సంక్షేమ శాఖ నుంచి గత ప్రభుత్వంలో మంజూరయ్యాయి. మూడు నెలల క్రితం కాంట్రాక్టర్ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించారు. దీంతో దశాబ్దాలుగా మట్టిరోడ్లతో ఇబ్బందులుపడ్డ తండా ప్రజలు బీటీ రోడ్లు నిర్మిస్తుండటంతో సంతోషం వ్యక్తం చేశారు. అయితే ఏమి జరిగిందే తెలియదు మూడు నెలలు దాటినా పనులు ముందుకు సాగడంలేదు. కాంట్రాక్టర్ మట్టి రోడ్డును తవ్వించి కంకర మాత్రమే పరిచి ఆ తర్వాత పట్టించుకోవడంలేదు.

రాకపోకలకు ఇబ్బందులు

రోడ్డుపై కంకర వేసి వదిలేయడంతో రైతులు, వాహనదారులు రాకపోకలు సాగించేందుకు నానా అవస్థలుపడుతున్నారు. ఈ రోడ్డు మార్గం నిత్యం రద్దీగా ఉంటుంది. కాంట్రాక్టర్ కంకర వేసి పనులు నిలిపివేయడంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ రోడ్డుపై ప్రయాణిస్తుండటంతో తమ వాహనాలు దెబ్బతింటున్నాయని వాహనదారులు వాపోతున్నారు. రోడ్డు నిర్మాణం త్వరగా పూర్తి చేయాలని అధికారులు, నాయకులను పలు మార్లు కోరినా పట్టించుకోవడంలేదని విచారం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

రోడ్ల నిర్మాణం ఎప్పటికి పూర్తయ్యేనో?



రామవరం నుంచి శివాలి తండా మీదుగా అనేక మంది రోజూ రాకపోకలు సాగిస్తారు. కానీ, కంకర తేలి ఉండటంతో వాహనాలు త్వరగా దెబ్బతింటున్నాయి. బీటీ రోడ్డు నిర్మాణం కల ఎప్పుడు నెరవేరుతుందో? ఇప్పటికే సదరు కాంట్రాక్టర్‌కు పలుమార్లు త్వరగా రోడ్డు నిర్మాణం పూర్తిచేయాలని కోరినా పట్టించుకోవడంలేదు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి త్వరగా రోడ్డు నిర్మాణం పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నాం.

– పొన్న కరుణాకర్, రైతు, రామవరం గ్రామం

రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు



నర్సయపల్లిలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న డీఆర్డీఓ పీడీ జయదేవ్‌ఆర్యా

మద్దూరు(హుస్నాబాద్): ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని డీఆర్డీఓ పీడీ జయదేవ్ ఆర్యా సిబ్బందిని ఆదేశించారు. గురువారం మండలంలోని నర్సయపల్లి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. ధాన్యం విక్రయించిన తర్వాత సకాలంలో ఖాతాల్లో డబ్బులు జమవుతున్నాయా, లేవా అని రైతులను అడిగి తెలుసుకొన్నారు. రికార్డులను పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడుతూ 17 శాతం తేమ వచ్చిన తరువాతనే తాలు పట్టాలన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చే రైతులకు వసతులు కల్పించాలని సెంటర్ నిర్వాహకులకు సూచించారు. అలాగే నర్సయపల్లి గ్రామంలో ఉపాధి హామీ పనులను పరిశీలించారు. ఎండ తీవ్రత అధికంగా ఉన్నందున కూలీలు ఉదయమే పనులు పూర్తి చేయాలన్నారు. ఆయన వెంట ఎంపీడీఓ రామ్మోహన్, ఏపీఎం బాబురావు, పంచాయతీ కార్యదర్శి భాస్కర్ తదితరులు ఉన్నారు.

ప్రజాసేవకు పట్టం కట్టండి

సీపీఎం మండల కార్యదర్శి శెట్టిపల్లి సత్తిరెడ్డి

కొమురవెల్లి(సిద్దిపేట): ప్రజాసేవకు పట్టంకట్టాలని సీపీఎం మండల కార్యదర్శి శెట్టిపల్లి సత్తిరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని పోసాన్‌పల్లి గ్రామంలో భువనగిరి పార్లమెంట్ సీపీఎం అభ్యర్థి జహంగీర్‌కు మద్దతుగా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భువనగిరి పార్లమెంట్ నియోజక వర్గానికి జహంగీర్ గత 30 ఏళ్లుగా ప్రజలకు నిస్వార్థంగా సేవ చేస్తున్నాడన్నారు. బీఆర్‌ఎస్, కాంగ్రెస్ అభ్యర్థులు ప్రజల సమస్యలు పట్టించుకోలేదని విమర్శించారు. జహంగీర్‌ను



పోసాన్‌పల్లిలో ప్రచారం చేస్తున్న సీపీఎం నాయకులు

అధిక మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు తాడూరి రవీందర్, మండల నాయకులు బక్కెల్లి బాల కిషన్, సత్తయ్య, పూస మల్లేశం, పుట్టబాబు, పిట్ట కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా రథోత్సవం



భక్తులతో కిక్కిరిసిన శ్రీలక్ష్మీనర్సింహ స్వామి ఆలయ ప్రాంగణం

బెజ్జంకి(సిద్దిపేట): బెజ్జంకి శ్రీలక్ష్మీనర్సింహ స్వామి బ్రహ్మోత్సవాల్లో ముఖ్య ఘట్టం రథోత్సవం గురువారం జరిగింది. రథాన్ని విద్యుత్ దీపాలు, పూలమాలలు, మామిడి తోరణాలతో సర్వాంగ సుందరంగా అలంకరించి గుట్ట చుట్టూ తిప్పారు. హోమం, మహా పూర్ణాహుతి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు కాగడాలు వెలిగించి, కోళ్లను ఎగరవేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రాంగణం లక్ష్మీనర్సింహ స్వామి గోవింద నామస్మరణతో మారుమోగింది. అనంతరం ఏకాంతసేవ చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. బెజ్జంకి పోలీసుల ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో ఈఓ పీవీ శర్మ, ఆలయ పూజారి మధుసూదనాచారి, సిబ్బంది భక్తులు పాల్గొన్నారు.

పటిష్ట పోలీసు బందోబస్తు



బందోబస్తు పై పోలీసు అధికారులతో మాట్లాడుతున్న సీపీ అనురాధ

సిద్దిపేటకమాన్: బీజేపీ మెదక్ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావుకు మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించేందుకు సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో గురువారం నిర్వహించిన సభకు కేంద్ర హోంమంత్రి అమిత్ షా హాజరయ్యారు. దీంతో జిల్లా పోలీసు శాఖ పటిష్ట పోలీసు బందోబస్తు చేపట్టింది. అమిత్ షా కాన్వాయ్ వచ్చే రోడ్డు మార్గంలో పోలీసులు మోహరించారు. సీపీ అనురాధ నేతృత్వంలో 12 సెక్టార్లలో హెలీప్యాడ్, రోడ్డు మార్గం, వాహనాల పార్కింగ్, సభాస్థలి వద్ద పోలీసు అధికారులు, సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. బందోబస్తును అడిషనల్ డీసీపీలు, ఏఆర్ అడిషనల్ డీసీపీలు, ఏసీపీ మధు, సీఐలు విద్యాసాగర్, లక్ష్మీబాబు, ఉపేందర్, శ్రీను పర్యవేక్షించారు.

ఉన్నత లక్ష్యాలు సాధించాలి

బీఎస్‌రావు ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ బీఎస్‌రావు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): విద్యార్థులు గొప్ప లక్ష్యాలు పెట్టుకుని వాటిని సాధించాలని బీఎస్‌రావు ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ బీఎస్‌రావు అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని టీఎస్ఎస్సీ స్టడీ సర్కిల్లో ఉద్యోగాలకు ప్రిపేర్ అవుతున్న అభ్యర్థులకు బీఎస్‌రావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో లిసెంట్ జనరల్ నాలెడ్జ్ పుస్తకాలను ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థులు కష్టపడి చదివి ఉన్నత ఉద్యోగాలు సాధించాలన్నారు. తమ ఫౌండేషన్ ద్వారా పేద ప్రజలకు సహాయం చేయడంతో పాటుగా, అనేక కార్యక్రమాల నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఓయూ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రవినాథ్, స్టడీ సర్కిల్ డైరెక్టర్ డాక్టర్ శ్రీకాంత్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు పుస్తకాలు అందిస్తున్న డాక్టర్ బీఎస్‌రావు

వైఎస్‌లా సీఎం రేవంత్



అనంతగిరిపల్లిలో కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి

గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి

వర్గల్(గజ్వేల్): సీఎం రేవంత్‌రెడ్డి ప్రజాసేవకు అంకితమై దివంగత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డిలా పేరు తెచ్చుకుంటున్నారని గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి అన్నారు. గురువారం వర్గల్ మండలం అనంతగిరిపల్లిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అప్పిడి సునీత, మాజీ పీఏసీఎస్ చైర్మన్ కాయిత ఎర్ర మల్లయ్య ఆధ్వర్యంలో పలువురు బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముదిరాజ్ బిడ్డ, బీసీ నాయకుడికి ఎంపీ సీటు కేటాయించిన ఘనత కాంగ్రెస్‌కే దక్కిందని, ఎంపీ ఎన్నికల్లో నీలం మధు గెలుపే ధ్యేయంగా పార్టీ శ్రేణులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఫుడ్స్ చైర్మన్ ఎలక్షన్ రెడ్డి, నియోజకవర్గ కాంగ్రెస్ ప్రచార కార్యదర్శి రంగారెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు సందీప్‌రెడ్డి, మాజీ ఎంపీపీ మోహన్, నాయకుడు కనకరాజు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కొండపాక(గజ్వేల్): మండలంలోని మర్పడ్గ గ్రామానికి చెందిన పలువురు బీఆర్‌ఎస్ నుంచి గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి సమక్షంలో గురువారం పార్టీలో చేరారు. పార్టీలో చేరిన మాజీ పీఏసీఎస్ డైరెక్టర్ బక్కి నర్సింహులు, బీఆర్‌ఎస్ నాయకులు భాస్కర్, బాల్‌నర్సు, గఫూర్‌తోపాటు మరో 20 మందికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా తూంకుంట నర్సారెడ్డి మాట్లాడుతూ పేదల సంక్షేమం కాంగ్రెస్‌లోనే సాధ్యమని కాంగ్రెస్‌లో చేరుతున్నారన్నారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి అనంతుల నరేందర్, మండల పార్టీ అధ్యక్షుడు లింగారావు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణతో వ్యాధులకు చెక్



రాజగోపాల్ పేటలో మలేరియాపై అవగాహన ర్యాలీ

నంగునూరు(సిద్దిపేట): మలేరియా సోకకుండా దోమల నివారణ చర్యలు చేపట్టాలని హెల్త్ సూపర్‌వైజర్ స్వామి అన్నారు. వరల్డ్ మలేరియా డే పురస్కరించుకొని గురువారం రాజగోపాల్‌పేట పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమలతో డెంగీ, మలేరియా, చికెన్ గున్యా వ్యాధులు ప్రబలుతాయన్నారు. దోమలు వృద్ధి చెందకుండా ఉండేందుకు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ అనురాధ, నర్సింగ్ అధికారులు, ఏఎన్‌ఎంలు, హెల్త్ అసిస్టెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

గజ్వేల్‌లో..

గజ్వేల్‌రూరల్: సంపూర్ణ ఆరోగ్యానికి ఇళ్ల మధ్య మురికి గుంతలు, చెత్తాచెదారం లేకుండా పరిశుభ్రంగా ఉంచుకొని మలేరియాను తరిమిట్టాలని గజ్వేల్ సబ్‌యూనిట్ ఆఫీసర్ డాక్టర్ శ్రీనివాస్ పేర్కొన్నారు. ప్రపంచ మలేరియా నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం గజ్వేల్‌లో మలేరియా నిర్మూలన అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశం నుంచి మలేరియాను పూర్తిగా నిర్మూలించేందుకు ప్రజలు సహకరించాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకున్నప్పుడే ఆరోగ్యంగా ఉంటామని, ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూడాలన్నారు. అలాగే మండల పరిధిలోని అహ్మదీపూర్ గ్రామంలో డాక్టర్ ప్రణయ్‌రాజ్ మలేరియా నిర్మూలన అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో వైద్యులు రాకేష్, సంధ్య, అరుణ, సిబ్బంది సుగంధ, దివ్య, రష్మి, అరుణ, వాసుదేవ్, జోసెఫ్, పాండు, నవిత, మంజుల, రమ, రాజు తదితరులు పాల్గొన్నారు.

బీఎల్‌ఓలు సమన్వయంతో విధులు నిర్వర్తించాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ వెంకట రెడ్డి

దుబ్బాకటౌన్: పార్లమెంట్ ఎన్నికల్లో బీఎల్‌ఓలు సయన్వయంతో విధులు నిర్వహించాలని దుబ్బాక ఏఆర్‌ఓ, తహసీల్దార్ వెంకట రెడ్డి అన్నారు. గురువారం దుబ్బాక ఐసీడీఎస్ కార్యాలయంలో ఎన్నికల విధులపై అవగాహన కల్పించేందుకు బీఎల్‌ఓలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటరు సమాచార స్లిప్‌లను వారం రోజుల్లోగా పంపిణీ చేయాలన్నారు. పంపిణీలో జాప్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్‌లు సందీప్, సాజిద్, ఆర్‌ఐలు నర్సింహారెడ్డి, నరేందర్, కార్యాలయ సిబ్బంది జావేద్, రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

యోగాతోనే యోగం

డాక్టర్ భాస్కర్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): యోగాతోనే యోగం కలుగుతుందని ప్రముఖ వైద్యుడు భాస్కర్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని వ్యాసమహర్షి యోగా కేంద్రంలో బాలసంస్కార్ వేసవి శిక్షణ శిబిరం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు బాల్యంలోనే సృజనాత్మక శక్తిని వెలికి తీస్తే వారు అద్భుతాలను సృష్టిస్తారన్నారు. యోగా, ప్రాణాయామం, ధ్యానం వైద్యశాస్త్రంలో ప్రముఖ పాత్ర వహిస్తున్నాయన్నారు. ఈ వేసవి సెలవుల్లో పిల్లల మానసిక, శారీరక వికాసానికి తల్లిదండ్రులు తోడ్పాటు అందించాలన్నారు. యోగా, ధ్యానం, పాటలు, శ్లోకాలు, కథలు, కర్రసాము, నృత్యం, పెయింటింగ్, అబాకస్ తదితర అంశాల్లో శిక్షణ ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో వ్యాస మహర్షి యోగ సొసైటీ అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, యోగా శిక్షకులు తోట సతీష్, సంధ్య, సిద్దిపేట యోగాసనా స్పోర్ట్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు అంజయ్య, అధ్యక్షుడు తోట అశోక్ , సిద్దిపేట జిల్లా టీఎన్జీవోల సంఘం ప్రధాన కార్యదర్శి విక్రం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బాలసంస్కార్ వేసవి శిక్షణ శిబిరంలో పాల్గొన్న చిన్నారులు

రోడ్‌షోకు తరలిన బీఆర్‌ఎస్ శ్రేణులు



భువనగిరి వెళ్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

కొమురవెల్లి(సిద్దిపేట): భువనగిరి బీఆర్‌ఎస్ పార్లమెంట్ అభ్యర్థి క్యామ మల్లేశ్‌కు మద్దతుగా భువనగిరిలో చేపట్టిన భారీ రోడ్‌షోకు మండల నాయకులు గురువారం తరలివెళ్లారు. రోడ్డుషోకు బస్సులో తరలివెళ్లేందుకు సిద్ధమవుతుండగా గ్రామానికి చెందిన ఓ వ్యక్తి బస్సుపై రాయితో దాడిచేశాడు. బస్సు అద్దం పగలడంతో బీఆర్‌ఎస్ నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో విచారణ చేపట్టారు. రోడ్డుషోకు వెళ్లిన వారిలో జెడ్పీటీసీ సిద్దప్ప, ఏర్పుల మహేష్, కొండ శ్రీధర్, పీఏసీఎస్ డైరెక్టర్ నర్సింహులు తదితరులు ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ నేడు మంత్రి రాక

కోహెడ(హుస్నాబాద్): పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా మంత్రి పొన్నం ప్రభాకర్, కరీంనగర్ పార్లమెంట్ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావుతో కలిసి శుక్రవారం మండల కేంద్రానికి రానున్నారు. ఉదయం 7 గంటలకు హైస్కూల్ నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మంద ధర్మయ్య గురువారం తెలిపారు. కాగా మంత్రి సమక్షంలో పలువురు ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లు కాంగ్రెస్ పార్టీలో చేరనున్నట్లు తెలిసింది.

◆ కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడిగా వెంకటి

సిద్దిపేటరూరల్: కాంగ్రెస్ పార్టీ రూరల్ మండలంలోని రాఘవాపూర్ గ్రామ అధ్యక్షుడిగా పిట్ల వెంకటిని నియమిస్తూ మండల శాఖ అధ్యక్షుడు రాములు నియామక పత్రాన్ని గురువారం అందజేశారు. ఉపాధ్యక్షుడిగా బాబు, ప్రధాన కార్యదర్శిగా లింగం, కార్యదర్శులుగా గొడుగు రామచంద్రం, శ్రీనివాస్, సలహాదారులుగా కనకయ్య, మురళి నియమితులయ్యారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు రాములు మాట్లాడుతూ గ్రామాల వారీగా పార్టీ కమిటీలను నియమించడం జరుగుతుందన్నారు. పార్టీ చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు.

◆ కార్మికుల వేతనాలు చెల్లించాలి

గజ్వేల్‌రూరల్: పెండింగ్‌లో ఉన్న గ్రామ పంచాయతీ (జీపీ) కార్మికుల వేతనాలు వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సందబోయిన ఎల్లయ్య డిమాండ్ చేశారు. గురువారం విలేకరులతో మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధిలో క్రియాశీలక పాత్ర పోషించే పారిశుద్ధ్య కార్మికులపై చిన్న చూపు తగదన్నారు. చాలీచాలనీ వేతనాలతో కుటుంబాలను పోషించుకోలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నాలుగు నెలలుగా వేతనాలు అందక పోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ప్రభుత్వం స్పందించి వేతనాలు చెల్లించడంతో పాటు వారి సమస్యలను పరిష్కరించాలన్నారు. లేనిపక్షంలో మెరుపు సమ్మెకు దిగుతామని హెచ్చరించారు.

◆ ఎన్నికల నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

తొగుట(దుబ్బాక): ఎన్నికల కమిషన్ నిబంధనలను అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని తొగుట సీఐ లతీఫ్ హెచ్చరించారు. మండలంలోని తుక్కాపూర్ శివారులో గురువారం వాహనాల తనిఖీ చేపట్టారు. తనిఖీల్లో రూ.68 వేలు సీజ్ చేశామన్నారు. ఎన్నికల నిబంధనల మేరకు రూ.50 వేలు తీసుకెళ్లేందుకు అనుమతి ఉందని, అంతకు మించి ఉంటే తగిన ఆధారాలు చూపాలన్నారు.

◆ ప్రమాద బీమా ప్రకటించాలి

దుబ్బాకరూరల్: మండలంలోని హబ్సిపూర్ గ్రామంలో ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలను గురువారం డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్ పరామర్శించి వారి సమస్యలు తెలుసుకున్నారు. ఉపాధి కూలీలతో కలిసి భారత రాజ్యాంగ పరిరక్షణ ప్రచారోద్యమ కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పనులు చేసే ప్రదేశంలో కూలీలకు వసతులు కల్పించాలన్నారు. ఎండలకు వడదెబ్బ తగిలే ప్రమాదం ఉందని నీడ కోసం టెంట్లు వేయించాలని, అందుబాటులో ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు, మంచి నీళ్లు ఉంచాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధి కూలీలకు రూ.300లు పెంచినప్పటికీ వాటిని పూర్తిగా చెల్లించడం లేదని ఆరోపించారు. ప్రమాద బీమా రూ.5 లక్షలు ఇస్తామని రాజకీయ పార్టీలు తమ మేనిఫెస్టోలో ప్రకటించాలన్నారు.

◆ బెల్ట్‌షాప్‌పై దాడి

అక్కన్నపేట(హుస్నాబాద్): అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న బెల్ట్‌షాప్‌పై టాస్క్‌ఫోర్స్, పోలీసులు గురువారం దాడి చేశారు. మండలంలోని మల్‌చెర్వుతండాకు చెందిన గుగులోతు అలియా తన కిరాణా షాపులో అనుమతి లేకుండా మద్యం అమ్ముతున్నాడన్న విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు దాడులు చేశారు. 31.330 లీటర్ల బీరు, విస్కీ బాటిల్స్ గుర్తించి స్వాధీనం చేసుకొని, కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వివేక్ తెలిపారు.

◆ నేటి నుంచి విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలు

మిరుదొడ్డి(దుబ్బాక): మండల పరిధిలోని ధర్మారంలో ఈ నెల 26 నుంచి 29 వరకు మహంకాళి విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలు నిర్వహిస్తామని ఆలయ కమిటీ సభ్యులు గురువారం తెలిపారు. 26న యాగశాల ప్రవేశం, స్వస్తి వాచనం, 27న ఆవాహిత దేవతా పూజలు, హారతి, 28న యంత్ర ప్రతిష్ఠ, పోచమ్మ బోనాల ఊరేగింపు, 29న మహంకాళి బోనాల ఊరేగింపు నిర్వహిస్తామన్నారు.

◆ నీలం మధుకు ముదిరాజ్‌ల మద్దతు

గజ్వేల్‌రూరల్: మెదక్ పార్లమెంట్ అభ్యర్థి నీలం మధును భారీ మెజార్టీతో గెలిపించుకుంటామని ముదిరాజ్ సంఘం నాయకులు పేర్కొన్నారు. గురువారం గజ్వేల్‌లో వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ముదిరాజ్‌లకు ప్రత్యేక కార్పొరేషన్ ప్రకటించడం సంతోషంగా ఉందన్నారు. పార్టీ అధిష్టానం, సీఎం రేవంత్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.